మినీ కథ

# మాయాలోకం

## ఎం. డి. సౌజన్య

సినిమా సెట్లో, ఒక రోజు సినీతార మాలిని తన ముప్పయి రెండవ పుట్టిన రోజు పండుగను, యిరవై మూడో పుట్టిన రోజు పండుగగా ఘనంగా జరుపుకుంటోంది ఒక సినిమా షూటింగ్-విరామ సమయంలో!

బిజీతార మాలిని ఆప్త మిత్రులు కొందరు సరాసరి ఆ సినిమా సెట్లోకే వచ్చి పార్టీలో పాల్గొంటున్నారు. మాలిని ఉభయాహారి కావటంతో "వెజ్"-నాన్ వెజ్" వంటకాలు ఘుమ ఘుమ లాడి పోతున్నాయి.

మాలిని తన ప్రక్కనే కూర్చున్న బ్యూటీ పార్లర్ నడుపుతున్న డాక్టర్‌తో "డాక్టర్! నన్ను పెద్ద నిర్మాతలంతా పారిస్ బ్యూటీ కంటెస్ట్‌కు వెళ్ళమంటున్నారు! నాకేమో డైటింగ్ చేసి యింకా స్లిమ్‌గా తయారై వెళ్ళాలని వుంది. వెజిటేరియన్ డైట్ ఏం తీసుకుంటే మంచి దంటారు?" అంది

"ఆకు కూరలు, పళ్ళు—ముఖ్యంగా లెమన్, ఆరంజి మంచివి! దుంప కూరలు-అరటి పళ్ళొద్దు!" అన్నాడు సలహాయిస్తూ.

"థ్యాంక్యూ! థ్యాంక్యూ! ...ఆ... ...బైదిబై .......నాన్ వెజిటేరియన్ సంగతి చెప్పండి....అది తినకుండా ఉండలేను!" అంది, మాలిని నవ్వుతూ.

"చికెన్ మంచిది... మటన్ సూప్ ఒకప్పు, రెండు స్లయిస్డ్ రొట్టెల్తో మంచిది!.... లిక్విడ్ డయిట్ మంచిది! బట్టర్ వాడకండి....కర్డ్ వద్దు... బటర్ మిల్క్ తీసుకోండి! మార్నింగ్ లైట్ ఎక్సర్‌సైజ్!" అంటూ చెబుతున్నాడు.

ఇంతలో నిర్మాత మురుగన్ వచ్చి "మాలినిగారూ! మీకభ్యంతరం లేక పోతే ఈ సెట్లో జరుగుతున్న మీ బర్త్‌డే విందు పార్టీని కలర్‌లో రెండు రీళ్ళుగా షూట్ చేయమంటాను!" అన్నాడు.

"ష్యూర్...ష్యూర్... యు కెన్ ప్రొసీడ్ యు కెన్ ప్రొసీడ్!" అంది, అక్కడి నుంచి లేచి వెళ్ళి మళ్ళీ కొత్త ట్రిమ్‌గా మేకప్ కావటానికి.

ఇంతలో బ్యూటీ పార్లర్ డాక్టరు తన ప్రక్కనే ఉన్న వ్యక్తితో "ఏమో అనుకున్నాను! మాలిని గొప్ప నటే కాదు.... చాలా తెలివి కలది కూడాను! చూశారా నా బ్యూటీ పార్లర్ కొచ్చి అడిగే సలహాలన్నీ పయాపైసా ఖర్చు లేకుండా తెలివిగా అడిగి తెలుసుకుంది!" అన్నాడు.

ఆ నల్లకోటు వ్యక్తి చిరునవ్వుతో సమాధానం చెప్పకుండా దాటేశాడు.

అయినా డాక్టర్ ఆ నల్లకోటు వ్యక్తిని వదలకుండా "ఇదే సలహా




డైటింగ్‌కు సంబంధించి ఎవరికి చెప్పినా.. నేను రెండొందలు చార్జి చేస్తాను! రేపు రెండొందలకు బిల్లు పంపుతాను!... పంపటం బావుంటుందంటారా? మీరు సలహా చెప్పండి!" అన్నాడు.

"తప్పకుండా పంపండి! సినిమా సెట్‌తో బర్త్‌డే పార్టీ అని-ప్రొడ్యూసర్ అరేంజ్ చేసినట్టే చేసి, యీ బర్త్‌డే పార్టీ షూట్ చేసి, దాన్ని ఏదత్త సినిమాతో కలిపి చూపించి, డబ్బు చేసుకుంటాడు ప్రొడ్యూసర్!! అలాంటప్పుడు బ్యూటీ పార్లర్ డాక్టర్‌గా మీరిచ్చిన సలహాకు తప్పక ఫీజు వసూలు చేయవచ్చు!" అన్నాడు తన సలహానిస్తూ.

డాక్టర్ ముఖం ఆనందతో విప్పారింది. ఇంతలో మాలిని సెక్రటరీ వచ్చి "సార్! మా మిస్ మాలిని గారి ప్రక్కన ఎవరుంటే వాళ్లు అయిదు వేల విలువచేసే వజ్రాల ఉంగరం ప్రెజెంట్ చేయాలట! మా మూలుగా అయితే ఆమె సినిమా షూటింగ్‌కు గంటకు యాభై వేలు చార్జి చేస్తారు! ఇది మాలిని గారి బర్త్‌డే పార్టీ షూటింగ్ కాబట్టి యిదో ఛాన్స్.... ప్లీజ్ అదృష్టవంతులెవరో ముందుకు రావాలి! అన్నాడు.

పార్టీకొచ్చిన వారంతా ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టుకుండగా

"ఆ అయిదువేలు నేనే యిచ్చుకుంటాను ఇదిగో చెక్!" అంటూ మురుగన్ అయిదు వేలకు చెక్ అందించి, మాలిని ప్రక్కనే సీటు ఆక్రమించాడు.

రెండవ రోజు బ్యూటీపార్లర్ డాక్టర్ మాలినికి రెండు వందలకు బిల్లు పంపి సంతోషిస్తుండగా పులిమీద పుట్రాలా లాయర్ నోటీసొచ్చింది "డియర్ డాక్టర్! మీరు నిన్న మాలిని పార్టీలో నన్ను ఒక సలహా అడిగారు' దానికి లాయర్‌గా నా ఫీజు మూడు వందలు పంపండి!" అని వుంది.